నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శనివారం 7 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## హౌస్ అరెస్టు చేయడం హేయం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్

జన్నారం, డిసెంబర్ 6 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు ఎమ్మెలు, ఎమ్మెల్సీలను హౌస్ అరెస్టు చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్ మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్‌కు కనీసం నివాళులర్పించకుండా నాయకులను గృహాల్లో నిర్బంధించడమంటే రాజ్యాంగాన్ని అవమానించినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు చెట్‌పెల్లి సత్యం, నాయకులు ఫజల్‌ఖాన్, వోలాల నర్సాగౌడ్, ప్రభుదాస్, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, దుమల్ల ఎల్లయ్య, శ్రీధర్‌రావు ఉన్నారు.

## టీబీజీకేఎస్ కాంట్రాక్టు కార్మికుల కార్యవర్గం




నూతన కార్యవర్గం వివరాలు వెల్లడిస్తున్న ఓదెలు

రెబ్బెన, డిసెంబర్ 6 : గోలేటిటౌన్‌షిప్‌లోని తెలంగాణ భవన్(టీబీజీకేఎస్ కార్యాలయం)లో ఇటీవల టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు సమక్షంలో బెల్లంపల్లి ఏరియా కాంట్రాక్టు కార్మికుల కార్యవర్గం ఎన్నుకున్నట్లు ఆ సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు పేర్కొన్నారు. శుక్రవారం గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా అంబాల ఓదెలు, ఉపాధ్యక్షులుగా కనక ఇస్తారి, విజయ్, ప్రధాన కార్యదర్శిగా ధన్‌రాజ్, సహాయ కార్యదర్శిగా రామగిరి వెంకటాచారి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నక్క ప్రభాకర్, ఆయిళ్ల రాజన్న, అశోక్, మహేందర్, ప్రవీణ్, కోశాధికారిగా దుర్గం ప్రవీణ్‌కుమార్, సలహాదారులుగా మారిన వెంకటేశ్వర్లు, కలవేణి సంపత్, మెంబర్లుగా పూసల సత్యనారాయణ, రత్నం రాజశేఖర్, గురు ప్రసాద్, తరంగి, కంబాల లక్ష్మణ్, దుర్గం బాబురావు, హరీశ్, సుజాత, జాడి జగదీశ్, బండి రవి, గొర్లపల్లి తిరుపతి, కాశీరాం, గోపాల్, విజయ్, శంకర్, సదయ్య, దిందార్, పోశన్న, ముష్క రవి, కృష్ణ, జాఫర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

# మంత్రి పదవి కోసమేనా..?!

## ఉన్నఫలంగా మాల సామాజిక వర్గంపై ప్రేమ ఒలకబోస్తున్న గడ్డం

- దళితుల మధ్య చిచ్చుపెడుతున్నారంటూ మండిపడుతున్న మాదిగలు
- అవసరం తీరాక మారిపోతారా అంటూ అసహనం
- ఇంత రచ్చ అవుతుందని వివేక్ అనుకోలేదా..!
- బలం చూపిస్తే మినిస్టర్ కావచ్చని ఆశ పడ్డారా..
- ఎస్సీ వర్గీకరణపై రగులుతున్న దుమారం




మంచిర్యాల, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జిల్లా ఎమ్మెల్యేలైన గడ్డం బ్రదర్స్ తమ రాజకీయ జీవితంలో ఎన్నడూ లేని విధంగా మాల సామాజిక వర్గంపై అమితమైన ప్రేమ ఒలకబోస్తుండడంపై అనేక రకాలుగా ప్రచారం జరుగుతున్నది. ముఖ్యంగా వివేక్ మంత్రి పదవి కోసమే ఆ సామాజిక వర్గాన్ని వాడుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతుండగా, స్థానికంగా చర్చనీయాంశమవుతున్నది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వివేక్ మాట్లాడారంటూ మాదిగ సామాజికవర్గం అగ్గి మీద గుగ్గిలమవుతున్నది. రాజకీయ స్వార్థం కోసమే ఏబీసీడీల వర్గీకరణను ఆపాలని చూస్తున్నారంటూ మండిపడుతున్నది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా మాదిగల నుంచి నిరసన వ్యక్తమవుతున్నది. మంత్రి పదవి కోసం దళిత సోదరుల మధ్య చిచ్చుపెడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### అవసరమున్నప్పుడు ఒకలా.. అవసరం తీరాక మరోలా..

ఎంపీ ఎన్నికల సమయంలో పెద్దపల్లి పార్లమెంట్ టికెట్‌ను గడ్డం వంశీకి ఇవ్వడాన్ని దళిత ఐక్య వేదిక నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నియోజకవర్గంలో మాదిగలకు మూడు లక్షల ఓట్లు ఉన్నాయని, అందుకే టికెట్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులకే ఇవ్వాలంటూ పట్టుపట్టారు. ప్రెస్‌మీట్‌లు పెట్టడం, నిరసనలకు దిగడంతో ఎట్టకేలకే గడ్డం కుటుంబం దిగిరావాల్సి వచ్చింది. ఆ సమయంలో మాదిగ సామాజిక వర్గం నాయకులను పిలిపించుకొని మాట్లాడి మరీ వారి మద్దతు కూడగట్టుకున్నారు. ఎంపీగా వంశీ గెలిచాక మాదిగల అవసరమే తమకు లేదన్నట్లు వివేక్ మాట్లాడుతున్నారంటూ ఆ సామాజిక వర్గం నాయకులు అంటున్నారు. రాజకీయంగా అవసరం ఉన్నప్పుడు ఒకలా.. అవసరం తీరిపోయాక మరోలా వ్యవహరించడం గడ్డం ఫ్యామిలీకి అలవాటైపోయిందని మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి మాదిగలు ముందు నుంచి అనుకూలంగా ఉంటూ వచ్చారని.. వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారని గుర్తించాలంటున్నారు. మాదిగ వ్యతిరేకిగా మారిపోయిన గడ్డం ఫ్యామిలీకి మంత్రి పదవి ఇస్తే ఊరుకునేదే లేదంటూ హెచ్చరిస్తున్నారు.

### తలనొప్పిగా మారిన వ్యవహారం..

ఈ వ్యవహారం ఎమ్మెల్యే వివేక్‌కు తలనొప్పిగా మారింది. చెన్నూర్ నియోజకవర్గంలోని మాదిగ సామాజిక వర్గం నాయకులంతా ఆయన వ్యవహారశైలిపై మండిపడుతున్నారు. గడ్డం వెంకట స్వామి దళితులందరినీ ఒకటిగా చూశారు తప్పితే ఎప్పుడూ వేరు చేసి మాట్లాడ లేదని, వివేక్ తీరుతో మాదిగ సోదరులకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడూ లేనిది మాలల మీద ఉన్నఫలంగా ఎందుకంత ప్రేమ పుట్టుకొచ్చిందో వివేక్ చెప్పాలంటూ ప్రశ్నిస్తున్నారు. కేవలం మంత్రి పదవి కోసమే సామాజిక వర్గాన్ని వాడుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. మాలలు దగ్గరైతే మంచిదే కానీ మాదిగలకు అన్యాయం చేయాల్సిన అవసరం వివేక్ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. చిలికి చిలికి గాలి వాన అయినట్లు మాలల వ్యవహారం వివేక్‌కు ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారింది. సామాజిక వర్గంలో తన బలం చూపించుకుంటే మంత్రి పదవి వస్తుందనుకున్నారో.. లేకపోతే ఇది ఇంత సీరియస్ అవుతుందని ముందే గుర్తించలేకపోయారో ఏమో కానీ వివేక్ పేరు చెబితేనే జిల్లాలోని మాదిగలు మండిపడుతున్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకుంటామని, వివేక్ ఏం చేసినా వర్గీకరణను ఆపలేరంటూ రోజుకో దగ్గర నిరసనలు తెలుపుతూ, పత్రికా ప్రకటనలు విడుదల చేస్తుండడం జిల్లాలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### మాల, మాదిగల మధ్య గొడవలు



సోదరుల్లా కలిసిమెలిసి ఉంటున్న మాల, మాదిగల మధ్య చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ గొడవలు సృష్టిస్తున్నారు. కేవలం మంత్రి పదవి కోసమే మాలలను వాడుకుంటున్నారు. ఏ ఒక్క మాల కుటుంబానికైనా ఆయన న్యాయం చేశారా ఆత్మవిమర్శ చేసుకోవాలి. సుప్రీం కోర్టు తీర్పునే తప్పుపట్టేంత అవసరం ఏమొచ్చింది. ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడం ఎవరితోనూ కాదు. వచ్చే ఎన్నికల్లో మాదిగ జాతి వివేక్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధం అవుతున్నది.

- కలగూర రాజ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, భీమారం

### మంత్రి పదవి కోసమే కుట్రలు



వివేక్‌కు మాలల మీద నిజమైన ప్రేమ ఉంటే ఇన్ని రోజులు వాళ్లు ఎందుకు గుర్తుకురాలేదు. అద్దంకి దయాకర్‌కు టికెట్ ఇవ్వనప్పుడు ఎందుకు మౌనం వహించారు. ఏ రకంగా ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణనకు అడ్డుకుంటారు. కేవలం మంత్రి పదవి కోసమే వివేక్ ఈ కుట్రలు, పన్నాగాలు పన్నుతున్నారు. మా జనాభా దామాషాను అనుసరించి హక్కుల కోసం పోరాడుతున్నాం. మాలలకు.. మాకు ఎలాంటి శత్రుత్వం లేదు. చెన్నూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది కాలంలో చేసింది ఏం లేదు. ప్రజలు ఆ విషయంలో ఎక్కడ నిలదీస్తారో అన్న భయంతోనే కొత్తడ్రామా ఆడుతూ మాదిగ జాతికి అన్యాయం చేయాలని చూస్తున్నరు. ఈ విషయాలన్నీ మాల, మాదిగ మేధావులు ఆలోచించాలి. దళితుల మధ్య చిచ్చుపెట్టే కుట్రలను ఖండించాలి.

- ఆసంపెల్లి సంపత్‌కుమార్, దళిత నాయకుడు



దహెగాంలో కల్లాల్లో అమ్మేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం

# ఫెంజల్ భయం

## పంటలపై ప్రభావం చూపుతున్న తుఫాన్

- పులి సంచారంతో దొరకని కూలీలు
- చేలల్లోనే తడిసిపోతున్న పత్తి
- కల్లాల్లోనే ధాన్యం కుప్పలు
- అన్నదాతల్లో ఆందోళన

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఫెంజల్ తుఫాన్ పంటలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నది. పులి భయంతో కూలీలు చేలకు వెళ్లకపోవడంతో ఎక్కడి పత్తి అక్కడే ఉంటుండగా, అకాల వర్షానికి తడిసి ముద్దవుతున్నది. ఇక కల్లాల్లో పోసిన ధాన్యం కుప్పలు సైతం నాని నష్టపోయే ప్రమాదముండగా, అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నది.

### పత్తి రైతులకు తీరని నష్టం..

జిల్లాలో అకాల వర్షాలు పత్తి రైతులకు తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి. రెండు మూడు రోజులుగా జల్లులు పడుతుండగా, శుక్రవారం ఆసిఫాబాద్ డివిజన్‌లోని రెబ్బెన, ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లో సుమారు గంట పాటు వర్షం దంచికొట్టింది. దీంతో చేలల్లో ఏరకుండా ఉన్న పత్తి తడిసిపోయింది. తేమ శాతం పెరగడంతో పాటు రంగుమారుతోంది. ఇలా అయితే పత్తికి మద్దతు ధర లభించే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చేల నుంచి ఇంటికి తరలించిన పత్తిలో సైతం తేమ శాతం పెరిగే అవకాశాలున్నాయి. జైనూర్, వాంకిడి, ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో కొద్ది రోజులుగా పులి సంచరిస్తుండగా, రైతులు, రైతు కూలీలు పత్తి ఏరేందుకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. నిత్యం ఎక్కడోచోట పశువులపై దాడుల చేస్తున్న నేపథ్యంలో చేలకు వెళ్లేందుకు వణికి పోతున్నారు. కిలో పత్తికి రూ. 12 ఇచ్చేందుకు రైతులు ముందుకు వస్తున్నా కూలీలు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే సరైన మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు అకాల వర్షాలు మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయి.

### కల్లాల్లోనే ధాన్యం..

జిల్లాలో పక్షం రోజుల క్రితం వరి కోతలు ప్రారంభించారు. వరి కొనుగోలు కేంద్రాలు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడంతో వడ్లను అమ్మేందుకు రైతులు కల్లాల్లో కుప్పలు పోసుకొని ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో ఆకాశం మబ్బులు పట్టి జల్లులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో 59 వేల ఎకరాల్లో వరి సాగు కాగా, ఇంకా అమ్మకాలను పూర్తిగా ప్రారంభించలేదు. ప్రభుత్వం 36 కొనుగోలు కేంద్రాలను అందుబాటులోని తేవాలని భావించినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభించలేదు. దీంతో రైతులు ధాన్యం అమ్మేందుకు ఎదురుచూస్తున్నారు.



వర్షానికి చెట్లపైనే తడిసిన పత్తి

## రెగ్యులర్ చేయాల్సిందే

### కలెక్టరేట్ ఎదుట సమగ్రశిక్షా ఉద్యోగుల ధర్నా




నిరసన తెలుపుతున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 6 : కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు తమ గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇకనైనా స్పందించి తమను రెగ్యులర్ చేయడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, జిల్లా నాయకులు, తదితరులు ఉన్నారు.

# పులుల సంరక్షణపై అధ్యయనం చేస్తాం

- పీసీసీఎఫ్ డోబ్రియాల్
- మహారాష్ట్ర ఫారెస్ట్ ఆఫీసర్లతో ఇంటర్ స్టేట్ మీటింగ్
- పలు అంశాలపై చర్చ



మహారాష్ట్ర అటవీ అధికారులతో కో ఆర్డినేషన్ మీటింగ్‌లో మాట్లాడుతున్న పీసీసీఎఫ్ డోబ్రియాల్

కుమ్రం భీం ఆసిఫాబాద్, (నమస్తే తెలంగాణ)/కౌటాల, డిసెంబర్ 6 : మహారాష్ట్రలోని తడోబా, కనర్‌గాం ఫారెస్ట్‌లో పులులు ఎక్కువగా ఉన్నాయని, అక్కడ క్షేత్రస్థాయిలో పర్యటించి వాటి సంరక్షణకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై అధ్యయనం చేస్తామని పీసీసీఎఫ్ డోబ్రియాల్ అన్నారు. జిల్లాకు పులుల రాకపోకలు పెరగడం.. ఇటీవల జరిగిన పలు ఘటనల నేపథ్యంలో శుక్రవారం సిర్పూర్-టీ మండలం మాకిడి - జక్కాపూర్ అటవీ ప్రాంతంలో స్టేట్ వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ ఈలుసింగ్ మేరు, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్‌తో కలిసి మహారాష్ట్ర అధికారులతో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ టైగర్ రిజర్వులలో పులులు పెద్ద సంఖ్యలో ఉండడం, వాటిని ఆనుకొని ఉన్న ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఫారెస్ట్‌లోకి రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో పలు అంశాలపై చర్చించారు. మహారాష్ట్రలో పులుల సంరక్షణ చర్యలు ఏ విధంగా ఉన్నాయి, వాటి పర్యవేక్షణ ఎలా ఉందనే విషయాలను మహారాష్ట్ర అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పులుల నుంచి మనుషులను రక్షించేందుకు, అడవులు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు ఎలాంటి విధానాలు అమలు చేస్తున్నారని అడిగారు. మహారాష్ట్రలో పులి దాడులు ఎక్కువగానే ఉన్నాయని, మనుషులతో పాటు పశువుల యజమానులకు కూడా నష్టపరిహారం మెరుగ్గా ఇస్తున్నామని చంద్రాపూర్ జిల్లా అటవీ అధికారి అవదూర్ వార్ వివరించారు. పశువులు పులి దాడిలో చనిపోతే మార్కెట్ రేటును బట్టి పరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు. పులుల సంరక్షణలో స్థానిక ప్రజలను భాగస్వాములను చేస్తున్నామని, ప్రతి గ్రామంలో ప్రైమరీ రెస్క్యూ టీంలను ఏర్పాటు చేశామని, వీరంతా పులికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తారని అధికారులు వివరించారు. డోబ్రియాల్ మాట్లాడుతూ తెలంగాణ- మహారాష్ట్ర ఫారెస్ట్ అధికారుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. తెలంగాణలోని కాగజ్‌నగర్ సహా మిగిలిన ప్రాంతాల్లో ఆడ పులులు ఆవశ్యకత ఎక్కువగా ఉన్నట్లు ఇటీవల పరిశీలనలోకి వచ్చిందన్నారు. కాగా, మీటింగ్ ఏర్పాటు చేసిన చోట మెయిన్ రోడ్ మీద పులి మలాన్ని అధికారులు గుర్తించడం గమనార్హం. ఈ సమావేశంలో చంద్రాపూర్ సబ్ డీవో సాహు, దాబాద్ ఆర్ఎఫ్‌వో గౌర్ కౌర్, బయాలజిస్ట్ ఏల్లంపాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడి

నస్పూర్, డిసెంబరు 6 : పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు విద్యార్థులతో కలిసి శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌ను ముట్టడించారు. రాష్ట్ర అధ్యక్షుడు రామ్ ప్రసాద్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. వెంటనే స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశీష్, అమోఘ్, రంజిత్,వాసు, సాయికృష్ణ పాల్గొన్నారు.




మంచిర్యాల కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్న నాయకులు

## కాంగ్రెస్ పట్టణ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌పై సస్పెన్షన్ వేటు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 6 : కాంగ్రెస్ పార్టీ నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందున మంచిర్యాల పట్టణ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్ట లావణ్యను పార్టీ నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ కమిటీ మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత శుక్రవారం ఓ ప్రకటను విడుదల చేశారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నందున తన పదవిని, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## పులి దాడిలో గేదె మృతి



పులి దాడిలో మృతి చెందిన గేదె

కౌటాల, డిసెంబర్ 6 : సిర్పూర్(టీ) మండలం చీలపల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం పులి దాడిలో ఓ గేదె మృతి చెందింది. బాధితుడు జెల్ల నగేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పశువుల కాపరి జెల్ల సాయి గేదెలను తోలుకొని స్థానిక అటవీప్రాంతానికి వెళ్లాడు. మధ్యాహ్నం పులి ఒక్కసారిగా గేదెల మందపై దాడి చేసింది. గమనించిన సాయి పెద్దగా కేకలు వేస్తూ సమీపంలోని చెట్టుపైకి ఎక్కాడు. చుట్టు పక్కల ఉన్న రైతులు, కూలీలు కేకలు వేస్తూ అక్కడికి చేరుకోవడంతో పులి వెళ్లిపోయింది. పులి దాడిలో ఓ గేదె చనిపోగా, మరో రెండింటికి గాయాలయ్యాయి.

## తోడేళ్ల దాడిలో గొర్రెల మృతి

జన్నారం, డిసెంబర్ 6 : మండలంలోని మురిమడుగు గ్రామానికి చెందని సందవేణి రాజంకు చెందిన గొర్రెల మందపై శుక్రవారం తెల్లవారు జామున తోడేళ్లు దాడి చేశాయి. దొడ్డిలోకి చొరబడ్డ తోడేళ్లు 11 గొర్రెలను హతమార్చాయి. తనకు జీవనాధారమైన గొర్రెలు మృతి చెందాయని, రూ. లక్ష వరకు నష్టపోయానని, అటవీ అధికారులు పరిహారం అందించి ఆదుకోవాలని రాజం వేడుకుంటున్నాడు.



తోడేళ్ల దాడిలో మృతి చెందిన గొర్రెలు